సమీకృత హాస్టల్లో సమస్యల తిష్ట



మానకొండూర్‌లోని సమీకృత హాస్టల్



వెంటిలేటర్ నుంచి దోమలు రాకుండా గుడ్డల ఏర్పాటు

- ఏళ్లుగా వేధిస్తున్న వైనం
- ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదులు
- క్షేత్రస్థాయిలో పరిశీలన

మానకొండూర్: మండల కేంద్రంలోని సమీకృత హాస్టల్లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. హాస్టల్ సమస్యలపై క్షేత్రస్థాయి ఉద్యోగులు ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పరిశీలన చేసి సమస్యలు గుర్తించినా.. సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. హాస్టల్‌లో మరుగుదొడ్లు, మెస్ డోర్లు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా ఈ సమస్యలు హాస్టల్ విద్యార్థులను వేధిస్తున్నా.. అధికారులు గాలికొదిలేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో జిల్లా అదనపు కలెక్టర్ లాంటి పెద్ద ఆఫీసర్ హాస్టల్‌లో నిద్ర చేసి సమస్యలు స్వయంగా పరిశీలించినా.. సమస్యలు మాత్రం పరిష్కారానికి నేటికీ కార్యరూపం దాల్చలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఎన్నాళ్లు ఇలా హాస్టల్ సమస్యలతో వేగేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూతపడ్డ మరుగుదొడ్లు, బాత్‌రూంలు

హాస్టల్లో ప్రధానంగా మరుగుదొడ్లు, బాత్‌రూంల సమస్య ఉంది. హాస్టల్ నిర్మాణం జరిగి 15 ఏళ్లు గడిచినా.. ఇంతవరకు విండోలకు మెస్ డోర్లు లేక దోమలు హాస్టల్ గదిలోకి వస్తున్నాయి. విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. 2012లో హాస్టల్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం 180 మంది వరకు విద్యార్థులున్నారు. 20 బాత్‌రూంలు, 20 మరుగుదొడ్లు విద్యార్థుల కోసం ఏర్పాటు చేయగా.. అందులో 8 మరుగుదొడ్లు, 8 బాత్‌రూంలు మాత్రమే పని చేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. సమయానికి కాలకృత్యాలు తీర్చుకోలేకపోతున్నామని, సరిపడా మరుగుదొడ్లు, బాత్‌రూంలు లేక ఆలస్యంగా పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్మాణ సమయంలో కిటికీలకు ఇనుప డోర్లు ఏర్పాటు చేసినా.. వెంటిలేటర్ వద్ద ఎలాంటి డోర్లు ఏర్పాటు చేయలేదు. వెంటిలేటర్ గుండా, కిటికీలు తెరిచిన సమయాల్లో విపరీతమైన దోమలు హాల్లోకి చేరుకుంటున్నాయని విద్యార్థులు తెలిపారు. దోమలతో జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటిలేటర్ వద్ద అట్ట ముక్కలు, చిన్నచిన్న గుడ్డలు ఏర్పాటు చేసి దోమలు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. కోతులు కూడా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గన్నేరువరం: మండలంలో రహదారుల దుస్థితి అధ్వానంగా మారింది. అడుగడుగుకో గుంతతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఖాసీంపేట నుంచి గన్నేరువరంకు వెళ్లే పంచాయతీరాజ్ శాఖ రహదారి గుంతలమయంగా మారింది. ఈ రహదారి అభివృద్ధికి నిధుల మంజూరైనా పనులకు మోక్షం కలగడం లేదు. దీంతో నిత్యం ఈ రహదారిపై ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల ఈ రహదారిపై ఓ వ్యక్తి కట్టె మొద్దులను అడ్డంగా వేసి నిరసన వ్యక్తం చేశాడు. ఆ ప్రదేశంలో తాత్కాలిక మరమ్మతు చేపట్టినా మళ్లీ గుంత ఏర్పడింది. మండలంలోని ప్రతీ గ్రామంలో రహదారి పరిస్థితులు ఇలాగే ఉండడంతో నరకప్రాయంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు



హుజూరాబాద్‌రూరల్: కనుకులగిద్దె గ్రామంలో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి ఆధ్వర్యంలో బొడ్డెమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వీహెచ్‌పీ మహిళా మాతృశక్తి గ్రామ అధ్యక్షురాలు లింగాల రజిత-లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బొడ్డెమ్మ కన్నె పిల్లలు చేసుకునే పండుగని, వినాయక చవితి పండుగ తర్వాత వచ్చే భాద్రపద బహుళ పంచమి నుంచి తొమ్మిది రోజుల వరకు జరుపుకునే పండుగన్నారు. వీహెచ్పీ మండలాధ్యక్షుడు కంకణాల రమేశ్ రెడ్డి, కంకణాల లక్ష్మి, లింగాల నీరజ, జాలి లక్ష్మి, రొంటాల జ్యోతి, లింగాల పద్మ, లింగాల లావణ్య తదితరులున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీ గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుడు మాచర్ల అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గంగాభవాని జలశుద్ధి కేంద్రాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మండల నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన నిర్వాహకుడు మాచర్ల సాయికిరణ్‌గౌడ్‌ను అభినందించారు. సీనియర్ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బండారి రమేశ్, మోరపల్లి రమణారెడ్డి, గుజ్జుల రవీందర్‌రెడ్డి, మీసాల అంజయ్య, దావు సంపత్‌రెడ్డి, కొమ్మెర మల్లారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సింథటిక్ ట్రాక్(వాకింగ్)కు నిధులు కేటాయించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న శనివారం వినతిపత్రాన్ని అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ఎస్సై ఆవుల తిరుపతి పట్టుకున్నారు. లోకిని స్వామి ఇంట్లో 12 సంచుల్లో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉండగా.. స్వాధీనం చేసుకొని నిందుతుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్: పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో కాలువలు, చెరువులు, కుంటలు కబ్జా చేయడంతోనే వర్షం పడినప్పుడు కాలనీలు మునిగిపోతున్నాయని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్‌లో జరుగుతున్న జలవనరుల కబ్జాలపై అధికార యంత్రాంగానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి పెద్ద ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రామడుగు: వెంకట్రావుపల్లి పంచాయతీ కార్యాలయంలో శనివారం కరీంనగర్‌లోని మెడికవర్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు సుజిత్ ఆధ్వర్యంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులందజేశారు. వైద్యశాల నిర్వాహకులు గుర్రం కిరణ్, కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, గూడురి మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు

జమ్మికుంట: పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలను నిర్వహించారు. నాయకులు సలీం, రమేశ్, సురేశ్, వెంకటేశ్, మహేందర్, రాజు, లింగయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో విఫలం



రైతులతో మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

రామడుగు: రైతులకు సరిపడా యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. గోపాల్‌రావుపేట మన గ్రోమోర్ ఎరువుల కేంద్రం వద్ద ఉన్న రైతులను శనివారం కలిసి వారి ఇబ్బందులడిగి తెలుసుకున్నారు. పది సంవత్సరాల్లో రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేసిందని, కేసీఆర్ రైతులను రాజులుగా చేయాలని ప్రత్యేకంగా కృషి చేశారన్నారు.
బీజేపీ రామడుగు మండల అధ్యక్షుడు మోడీ రవీందర్ తండ్రి రామయ్య ఇటీవల మృతిచెందగా.. వారి కుటుంబాన్ని సుంకె రవిశంకర్ పరామర్శించారు. బక్కశెట్టి శ్రీనివాస్, ఖాసిం షరీఫ్, అజయ్, రాజు పాల్గొన్నారు.

యూరి'యాతన'



చెప్పలను వరుసలో పెట్టిన రైతులు

గంగాధర: యూరియా కోసం రైతులకు తంటాలు తప్పడం లేదు. గర్శకుర్తి గ్రామానికి శనివారం యూరియా లారీ వస్తోందనే సమాచారంతో రైతులు ఉదయాన్నే ఆగ్రో రైతు సేవాకేంద్రానికి చేరుకున్నారు. లారీ వచ్చేవరకు నిల్చొనే ఓపిక లేక వరుసలో చెప్పులు పెట్టి నిరీక్షించారు. 430 బస్తాలతో యూరియా లారీ రాగా.. ఒక్కో రైతుకు ఆధార్ కార్డుకు 2 బస్తాలు పంపిణీ చేశారు. పూర్తిస్థాయిలో రైతులకు యూరియా సరిపోలేదు. వందలాది మంది రైతులు యూరియా బస్తాకు నోచుకోకుండానే నిరాశగా వెనుదిరిగారు.

మార్కెట్ పాలకవర్గం సమావేశం



సమావేశంలో చైర్‌పర్సన్ స్వప్న, సభ్యులు

జమ్మికుంట: వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ పూల్లూరి స్వప్న-సదానందం అధ్యక్షతన శనివారం పాలకవర్గం సాధారణ సమావేశం నిర్వహించారు. జూన్, జూలై ఆదాయం, వ్యయం, రైతుల సరుకుల ధరలు తెలిపేందుకు డిజిటల్ బోర్డు ఏర్పాటు, మార్కెట్ యార్డు గోడ మరమ్మతు, కలర్లు, సీసీ ఫ్లోరింగ్‌తోపాటు పలు అభివృద్ధి పనుల కోసం తీర్మానం చేసి ఆమోదం తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ ఎర్రం సతీశ్‌రెడ్డి, సభ్యులు శ్రీపతిరెడ్డి, సతీశ్, సునీల్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, సురేశ్, దీక్షత్, శ్రీనివాస్‌రెడ్డి, దిషీద్ పాషా, తిరుపతి, శ్యామ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



సాయి సన్నిధిలో భజనలు

చొప్పదండి: పట్టణానికి చెందిన షిర్డిసాయి భజన మండలి, సాయి మహిళా సేవాసమితి సభ్యులు షిర్డిలోని సాయి సన్నిధిలో భజనలతో హోరెత్తించారు. షిర్డి సాయి సంస్థాన్ ట్రస్టు ఆహ్వానం మేరకు భజనలతోపాటు పల్లకి సేవాకార్యక్రమాలను భజన మండలి సభ్యులు నిర్వహించారు. దండె లింగన్న, దూస రాము, నలుమాచు చంద్రశేఖర్, పిట్టల రఘు, దండె కృష్ణ, పిట్టల లచ్చయ్య, మంచికట్ల మల్లేశం, కొత్తపల్లి శ్రీనివాస్, దూస లక్ష్మినర్సయ్య, నాగరాజు, భూమయ్య, మంద అంజయ్య, చింతల రవి, వెంగళ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆగని వరద.. పొంగుతున్న ముత్తారం వాగు

శంకరపట్నం: మండలంలో 2 రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ముత్తారం వాగులోకి వరద ప్రవహిస్తోంది. ముత్తారం రామసముద్రం చెరువులోకి ఎగువ నుంచి వదర నీరు రావడంతో.. చెరువు మత్తడి వాగులోకి పరవళ్లు దూకుతోంది. మత్స్యకారులు చేపలు పట్టారు. ఈ నీరంతా గండి పడిన కల్వల ప్రాజెక్టులోకి చేరుతోంది.

యూరియా అందించాలి

జమ్మికుంట: రాష్ట్రంలోని రైతులకు కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన యూరియాను అందించాలని, రైతులు యూరియా కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిళి రాకేశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

వారోత్సవాలు విజయవంతం చేయాలి

చిగురుమామిడి: ఇందుర్తి, పలు గ్రామాల్లో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇందుర్తి ప్రాంతంలో పార్టీ, ప్రజల కోసం తమ ప్రాణాలను అర్పించిన గునుకుల జనార్దన్‌రెడ్డి, కూన ముత్యాలు, ముస్కు రాజిరెడ్డి తదితర అమరుల వర్ధంతి కార్యక్రమం ఈనెల 15న నిర్వహించనున్నట్లు చెప్పారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లో స్మారక స్తూపాల వద్ద పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వికలాంగ పింఛన్ల పెంపుపై వివక్ష

చొప్పదండి: అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు ఆసరా పింఛన్ రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. పింఛన్ల పెంపుపై వివక్ష చూపిస్తోందని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వెల్మ బాపురెడ్డి విమర్శించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల హామీ మేరకు వికలాంగుల పింఛన్లతోపాటు నేత, గీత, బీడీ కార్మిక, ఆసరా పింఛన్లు రూ.2వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని హామీలు గుప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 15న అన్ని తహసీల్ కార్యాలయాల ఎదుట పింఛన్‌దారుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీ గ్రామానికి చెందిన రెడ్డి సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు దావు సంపత్‌రెడ్డి ఔదార్యం చాటుకున్నారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా విద్యను మధ్యలో ఆపినవారికి ప్రభుత్వం ఓపెన్ టెన్త్, ఇంటర్ చేయడానికి మహిళా సంఘాల ద్వారా అవకాశం కల్పిస్తోంది. రామకృష్ణ కాలనీ గ్రామంలో పలువురు అభ్యర్థులకు పరీక్ష ఫీజు కట్టడానికి ఇబ్బందిగా ఉండడంతో.. ఆయన రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. శనివారం గ్రామంలో మహిళా సంఘం ప్రతినిధులు ఆవుల రాధ, వేల్పుల పద్మ, పుష్ప, జగదీశ్వరికి అందజేశారు.

ఇటుక ట్రాక్టర్ బోల్తా

శంకరపట్నం: ధర్మారం గ్రామంలో శనివారం ఇటుక ట్రాక్టర్ బోల్తా పడినట్లు గ్రామస్తులు తెలిపారు. కొండపల్కల గ్రామం నుంచి సిమెంట్ ఇటుకల లోడ్‌తో ట్రాక్టర్ ధర్మారం గ్రామానికి వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గంగాధర: ఈనెల 17న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలతోపాటు తెలంగాణ విమోచన దినాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా నాయకుడు, మండల ఇన్‌చార్జి వాసాల రమేశ్ పిలుపునిచ్చారు. జన్మదిన వేడుకల సందర్భంగా చేపట్టే కార్యక్రమాలపై శనివారం మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

హుజూరాబాద్: ఈనెల 17న మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే సేవాపక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు గంగిశెట్టి ప్రభాకర్, మొహమ్మద్ అజార్, తిప్పబత్తిని రాజు, తూముల శ్రీనివాస్, రావుల వేణు, చంద్రిక, నరాల రాజశేఖర్ తదితరులున్నారు.

గన్నేరువరం: ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు బీజేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన సేవాపక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్ అన్నారు. గన్నేరువరంలో శనివారం మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యశాల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అజయ్‌వర్మ, రామచంద్రం, చంద్రారెడ్డి, బాలరాజు, రాము, అనిల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జగన్మోహన్, స్వామిరెడ్డి, విష్ణు, బలరాంరెడ్డి, చంద్రశేఖర్, సత్తయ్య, జగన్, నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నం: బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే సేవాపక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల ఇన్‌చార్జి శ్రీనివాస్ సూచించారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు అనిల్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వెంకట్‌రెడ్డి, కొంరయ్య, నరేందర్, శ్రీనివాస్, రాజిరెడ్డి, సారయ్య, రాజు, సాగర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

కరీంనగర్‌కార్పొరేషన్: వచ్చే ఎన్నికల్లో నగరపాలక సంస్థపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో సిటీ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేషన్‌ను కైవసం చేసుకోవాలన్నారు. నగరంలో భూమి ఉన్న ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. బతుకమ్మచీరల పంపిణీలో కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ టికెట్లు ఎవరికి ఇవ్వాలో అధిష్టానం చూసుకుంటుందని, అది ఏ ఒక్కరి చేతిలో లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నాయకులు వి.నరేందర్‌రెడ్డి, శ్రావణ్‌నాయక్, కొరివి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి అన్నారు. శనివారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా విద్యారంగంపై స రైన సదస్సు పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సంద గణేశ్, నగర అధ్యక్షుడు బుస మణితేజ, అభిలాష్, అభీరా నందన్, కుమార్, వంశీ, మణితేజ, హైమంత్ తదితరులు పాల్గొన్నారు.

జాగృతిని బలోపేతం చేస్తాం

విద్యానగర్(కరీంనగర్): కవిత నాయకత్వంలో జాగృతి సంస్థను బలోపేతం చేస్తామని జాగృతి జిల్లా నాయకులు అన్నారు. శనివారం కరీంనగర్‌లో జరిగిన జాగృతి నాయకుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ కవిత ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ జాగృతిని అన్ని విధాలా బలోపేతం చేస్తామని తెలిపారు. సమావేశంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్, జాగృతి యువజన విభాగం అధ్యక్షుడు విష్ణు, మహిళా విభాగం అధ్యక్షురాలు శివరాణి, నాయకులు అరుణ శివరాం, కంజర్ల రేణుక, సంగీత రెడ్డి, తిరుపతి, శ్రీరాములు రమేశ్, కనకయ్య, చంద్రశేఖర్, లక్ష్మణ్, యాసీన్, గుంజపడుగు హరిప్రసాద్, రజీ, తిరుపతి, సదానందం, విద్యాసాగర్, శివప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలకు చెందిన 2002-03లో 10వతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారంలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు ఒక్కచోటుకు చేరుకున్నారు. ఆచార్యులను శాలువాతో సత్కరించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యారణ్య ఆవాస విద్యాలయం అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడారు. గర్రెపల్లి అరుణ్‌కుమార్, హుజూరాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె శ్రీనివాస్-రాధిక, విద్యాపీఠం జిల్లా కార్యదర్శి ఆకుల రాజేందర్, ప్రబంధకారిణి అధ్యక్షుడు, కార్యదర్శి శీలం శ్రీనివాస్, దాసరి రవీందర్, ముక్కా జితేందర్ గుప్తా, ఆకుల రాజయ్య, బుచ్చు శివకుమార్, డింగిరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మోయతుమ్మెద వాగు కల్వర్టుకు మరమ్మతు



మరమ్మతు చేస్తున్న స్థానికులు

చిగురుమామిడి: ఇందుర్తి-కోహెడ వెళ్లే మోయతుమ్మెద వాగు కల్వర్టు భారీ వర్షాలకు దెబ్బతినగా.. స్థానికులు మరమ్మతు చేశారు. శనివారం వరద తగ్గుముఖం పట్టడంతో రోడ్డు గుంతలు పడి పూర్తిగా ధ్వంసమైంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో రాళ్లు, బండలు వేసి దానిపై మట్టి పోశారు. వాహనాలు యధావిధిగా రాకపోకలు సాగిస్తుండడంతో పలువురు ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డును తాత్కాలిక మరమ్మతు చేసిన వారిలో గొల్ల రాజయ్య, అమరగొండ కొంరయ్య, చెప్యాల రాములు, ఎంబరి శ్రీనివాస్ తదితరులున్నారు.